# నాకు అమ్మ కావాలి

ఇలపావులూరి మురళీ మోహనరావు

> "భద్రా! నలభై ఏళ్ల దాంపత్యంలో ఏనాడూ నీ మాట జవదాటలేదు. కోట్లాది రూపాయల ఆస్తి మీకు సమకూర్చాను. రోజుకు లక్ష రూపాయలు ఖర్చు పెట్టినా, ఈరవై తరాలు తినవచ్చు. నీ అఘాయిత్యాలకు బెదిరిపోయి కన్నతల్లిని అనాథగా ఆశ్రమంలో వదిలేశాను. నావంటి పాపి, నీచుడు మరొకడుండడు. కడసారిగా నా కన్నతల్లిని నాకు చూపించవా?" హీనస్వరంతో అన్నాడు.



ప్రఖ్యాత పారిశ్రామికవేత్త రంగరాజు తుది ఘడియల్లో మరణశయ్యమీద ఉన్నాడు. డబ్బుండేవారికి ఉండవలసిన జబ్బులన్నీ ఆయనకున్నాయి. అరవై అయిదు సంవత్సరాల వయసులో ఆయన మరణాన్ని వాయిదా వెయ్యాలని డాక్టర్లు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. స్వగృహంలో కన్ను మూయాలనే ఆయన కోరిక మేరకు ఆయనకిష్టమైన పర్సనల్ రూమ్‌లో హంసతూలికా తల్పంపై పరుండబెట్టారు.

మరో కొద్ది గంటల్లోనో, నిముషాల్లోనో మరణం తథ్యం. భార్య, ముగ్గురు పిల్లలు ఆయన చుట్టూ కూర్చుని విషణ్ణ వదనాలతో ఆయన శరీరాన్ని నిమురుతున్నారు.

బాగా స్థితిమంతుడు కావడంతో బంధువులు, బంధువులు కానివారు కూడా బిగ్గరగా రోదిస్తున్నారు. తమ రోదన రంగరాజు కుటుంబ సభ్యుల కంటపడుతున్నదో, లేదోనని మధ్యమధ్యలో ఆపి గమనిస్తున్నారు.

రంగరాజు తన స్వయంకృషితో అనేక పరిశ్రమలు స్థాపించి కోట్లకు పడగలెత్తాడు. వేలాదిమందికి ఉపాధి కల్పించాడు. ఎన్నో దానధర్మాలు చేసి 'కలియుగ శిబి'గా పేరుగాంచాడు. రాజకీయాలను శాసించాడు. సినిమా రంగాన్ని దడదడలాడించాడు. పత్రికలు స్థాపించాడు. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అన్న సూక్తిని నమ్మి గొప్ప వాణిజ్యవేత్తగా రాణించాడు.

అయితే అనారోగ్య దేవతకు మాత్రం పూర్తిగా లొంగిపోయాడు. డయాబెటిస్, రక్తపోటులాంటివి ఆయనను పూర్తిగా కుంగదీశాయి. వాటితోపాటు వచ్చే అనుబంధ వ్యాధులు ఆయన శరీరంలో కాపురం పెట్టాయి. వాటికి తోడు లివర్‌కు కాన్సర్ సోకడంతో ఆయనకు అంత్యకాలం అనివార్యమైంది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి విదేశాలలో చేయించిన వైద్యం విఫలమైంది. డాక్టర్లు తమ ప్రయత్నాలతో రంగరాజు మరణాన్ని సంవత్సరంపాటు వాయిదా వెయ్యగలిగారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా దాటిపోయింది.

మరణించిన తరువాత ఆయన ఆత్మ ప్రశాంతంగా వెళ్లడానికి వీలుగా నలుగురు పండితులు గీతా పారాయణం చేస్తున్నారు. ఇద్దరు డాక్టర్లు నిముషానికోమారు బి.పి., పల్స్ పరీక్షిస్తున్నారు.

ఒక పండితుడు రంగరాజు భార్య సుభద్రను పలకరించాడు.

"అమ్మా! ఎంత కోటీశ్వరుడైనా ప్రతి వ్యక్తికీ జీవితంలో తీరని కోరికంటూ ఒకటి ఉంటుంది. తీరని కోరికలతో మరణించిన వ్యక్తి యొక్క ఆత్మ వైకుంఠప్రాప్తి నొందక శూన్యంలోనే విహరిస్తూంటుంది. మరో శరీరంలోకి ప్రవేశించడానికి మార్గం లేక క్షోభిస్తుంటుంది. అందువలన రంగరాజుగారికి అలాంటి కోరికలేమైనా ఉంటే ఈ ఆఖరు క్షణాలలో తీర్చడానికి ప్రయత్నించడం మీ కర్తవ్యం!" ఉపదేశించాడు.

సుభద్ర ఆశ్చర్యంగా చూసింది.

"ఆయనకు తీరని కోరికలా? ఆయన సాధించని విజయం లేదు. చూడని దేశం లేదు. అనుభవించని యోగం లేదు. ఆయనకలాంటివేముంటాయి?" అడిగింది.

బలహీనంగా మూలిగాడు రంగరాజు. ఉదయం నుంచీ మాటా పలుకూ లేని తండ్రి అలా మూలగ్గానే పిల్లలకు దుఃఖం పొంగుకువచ్చింది.

"నాన్నా! మీకేం భయం లేదు. మీకేమీ కాదు, నాన్నా!" ఏడుస్తూ అన్నారు.

నీరసంగా నవ్వాడు రంగరాజు.

"నా కో కోరికుంది, తీరుస్తారా?" అడిగాడు.

"చెప్పండి నాన్నా! ఏం చెయ్యమంటారు?"

"మీ పేరిట అన్ని పుణ్యక్షేత్రాల్లో కాటేజ్‌లు కట్టించమంటారా?"

"అన్ని యూనివర్సిటీల్లో మీ పేర అవార్డులిప్పించమంటారా?"

"మీ పేరుతో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ కట్టించి పేదలకు ఉచిత వైద్యం చేయించమంటారా?"

ప్రశ్నలు గుప్పించారు ముగ్గురూ.

వద్దన్నట్లు తలాడించాడు రంగరాజు.

"మరేం చేయమంటారు చెప్పండి, మీ యావదాస్తీ అనాథలకు పంచమన్నా పంచుతాం!"

"వద్దు నాయనా... ఒక్కసారి మా అమ్మను తీసుకురాగలరా?"

అందరూ ఆశ్చర్యంగా సుభద్రవైపు చూశారు. ఆమె ముఖం మాడిపోయింది.

"రంగరాజుగారికి తల్లి ఉన్నదా?" గుసగుసలు వినిపించాయి.

"నలభై ఏళ్ల పరిచయంలో రంగరాజుగారికి తల్లి ఉన్నట్లు ఏనాడూ చూడలేదు. ఆవిడ ఉన్నారా?" అడిగాడు డాక్టర్.

సుభద్రవంక దీనంగా చూశాడు రంగరాజు.

"భద్రా! నలభై ఏళ్ల దాంపత్యంలో ఏనాడూ నీ మాట జవదాటలేదు. కోట్లాది రూపాయల ఆస్తి మీకు సమకూర్చాను. రోజుకు లక్ష రూపాయలు ఖర్చుపెట్టినా, ఈరవై తరాలు తినవచ్చు. నీ అభాయిత్యాలకు బెదిరిపోయి కన్నతల్లిని అనాథగా ఆశ్రమంలో వదిలేశాను. నావంటి పాపి, నీచుడు మరొకడుండడు. కడసారిగా నా కన్నతల్లిని నాకు చూపించవా?" హీనస్వరంతో అన్నాడు.

పల్స్‌రేట్ బాగా తగ్గింది. ఆయాసంతో రొప్పు ఎక్కువై శరీరమంతా వణుకుతోంది.

చిన్నకొడుకు డాక్టర్‌తో ఏదో మాట్లాడాడు. అతను చేతి వేళ్లు చూపుతూ ఏదో చెబుతున్నాడు. వెంటనే కొడుకు రివ్వున బయటకు వెళ్లాడు.

గంట గడిచింది. రంగరాజుకు ఎక్కిళ్లు ఆరంభమయ్యాయి.

దూరంగా ఒక వృద్ధురాలి ఆర్తనాదాలు వినిపించాయి.

"నా రంగా... బాబూ! ఏమైందిరా నీకు?" హృదయ విదారకంగా వినిపిస్తున్నాయి.

ఆ కంఠం వినగానే రంగరాజు శరీరంలోని ఓపికంతా గొంతులోకి వచ్చింది.

"అమ్మా... రామ్మా! దగ్గరకి రామ్మా...!" పెద్దగా ఏడ్చాడు.

రంగరాజును చూడగానే ఆమె కళ్లు కన్నీటి చెరువులయ్యాయి. రంగరాజును ఒడిలోకి తీసుకుంది. రంగరాజు ముఖంలో ఏదో కొత్తకాంతి! పసిపిల్లాడిలా తల్లి ఒడిలో ముడుక్కున్నాడు.

## ఛీఛీ! పచ్చిఅబద్ధాలు!

ఇటీవల ప్రముఖబాలీవుడ్ నటుడు అనుపమ్‌ఖేర్ భార్య కిరన్‌ఖేర్‌కు జాతీయఅవార్డు వచ్చిందని పేపర్లలో చాలా గొప్పగా వేశారు. కిరన్‌తో ఇంటర్వ్యూలు కూడా ప్రచురించారు. నిజానికి ఆ జంట ఆ అవార్డును అబద్ధం చెప్పి సంపాదించారని నేషనల్ అవార్డ్ బ్యూరో గౌతమ్‌ఘోష్ ఆరోపించారు. అవార్డు వచ్చిన 'బోరివాలీ' బాంగ్లా చిత్రంలో బంగ్లా సంభాషణలను పశ్చిమబెంగాల్‌కు చెందిన నటి రీతాకోయిరాలా చేత చెప్పించి, వాటిని కిరన్‌ఖేరే చెప్పిందని అబద్ధం చెప్పారట. డబ్బింగ్‌నుకూడా నటించినవారే చెబితే తప్ప అవార్డులివ్వరు. గతంలో డబ్బింగులు చెప్పనందువల్లే స్మితాపాటిల్, డింపుల్‌కపాడియాలకు గొప్పగా నటించినా అవార్డులు రానేలేదు. అదీ మృణాల్‌సేన్ చిత్రంలోనైనా సరే! ఇలా మోసంచేసి సంపాదించిన అవార్డుకు విలువ వుంటుందంటారా?

ఎస్.



"అమ్మా... వచ్చావా అమ్మా! ఈ జన్మలో నా ముఖం చూడవేమో అనుకున్నా. నన్ను క్షమించవనుకున్నా! అందుకేనమ్మా... నువ్వు తల్లివి! పెళ్లాం మాటలు విని తల్లిని తరిమేసిన కొడుకును నేను!" రంగరాజు కళ్లల్లో నీరు వరద గోదావరిలా ప్రవహించింది.

"వద్దు, రంగా! ఏడవద్దు నా తండ్రీ! నేను చూడలేను. నీకంటే ముందు పోవలసినదానిని. కొడుకు అంతిమ ఘడియల్ని చూడటానికి ఎంత పాపం చేసుకున్నానో?" గుండెలవిసేలా రోదిస్తున్నది తల్లి.

'ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే!' అంటే ఏమిటో ప్రత్యక్షంగా చూస్తున్నారందరూ.

"కాదమ్మా! తల్లి మరణం ఏ తనయుడూ చూడకూడదు. నవమాసాలు మోస్తారు. రొమ్ములమీద తంతున్నా పాలిస్తారు. బిడ్డల మలమూత్రాలను స్వహస్తాలతో తుడుస్తారు. బిడ్డలు ఎన్ని తప్పులు చేసినా కడుపులో దాచుకుంటారు. పెళ్లాంకోసం నిన్ను తరిమేశానని ఏనాడైనా ఎవరితోనైనా చెప్పావామ్మా నీవు?" బరస్టయ్యాడు రంగరాజు.

అరవై అయిదేళ్ల వృద్ధుడు అలా అమ్మ ఒడిలో పడుకుని పసిపాపలా రోదిస్తుంటే రాతి గుండెలు కూడా కరిగి నీరయ్యాయి.

"అటువంటి తల్లి చనిపోతే ఆ దేహాన్ని నిర్దయగా కిరోసిన్ పోసి తగలబెడతాడు కొడుకు. ఇంతకన్నా ఘోరం మరొకటుంటుందా? అదే కొడుకు చనిపోతే ఆ దారుణ కృత్యం తల్లి చెయ్యలేదని ఆ బాధ్యత తల్లికి తప్పించారమ్మా మన పెద్దలు!" తడబడుతూ అన్నాడు రంగరాజు.

"వద్దు రంగా.... అలా అనొద్దు. తన ప్రేగులు తెంచుకుని పుట్టిన బిడ్డ తన కళ్లముందే కన్నుమూస్తే ఆ రంపపుకోత ఏ తల్లీ భరించలేదు, నాన్నా! నా ఆయుష్షంతా నీకు ధారపోస్తాను, తీసుకోరా!" బిగ్గరగా ఏడ్చింది రంగరాజు తల్లి.

బలవంతంగా శక్తిని కూడదీసుకున్నాడు రంగరాజు.

"వద్దమ్మా, వద్దు! ఆ అర్హత నాకు లేదు. తల్లి త్యాగాలకు హద్దులు లేవు. ముగ్గురికి సరిపోయే అన్నం వండి తినవలసిన వారు నలుగురుంటే తనకు ఆకలి లేదనే మాట తల్లి నోటినుంచే వస్తుందమ్మా! అలాంటి తల్లి ఒడిలో కన్ను మూయాలనేదే నా చివరి కోరిక!" తుఫానులో తడిసి గజగజ వణికిపోతున్న గువ్వపిట్టలా తల్లి ఒడిలో మరింతగా ఒదిగిపోతూ అన్నాడు రంగరాజు.

రంగరాజు ప్రాణాలు కనుకొనల్లోకి వచ్చాయి. గీతా పారాయణం జోరు మరింత హెచ్చింది. ఆపమన్నట్లు సైగ చేశాడు రంగరాజు.

"మరణం తరువాత ఆత్మను స్వర్గానికి పంపేది ఈ గీతా పఠనాలు కాదు. కన్నతల్లి ఆశీర్వచనాలు. హృదయంతో దుఃఖించేది ఆమె ఒక్కతే! ఈ నలభై ఏళ్లలో నీ గురించి నాలో నేను కుమిలిపోని రోజే లేదమ్మా! నీ ఒడిలో చావాలని నిన్నటినుంచి ప్రాణాలు కళ్లల్లో పెట్టుకుని నీ కోసం ఎదురు చూస్తున్నానమ్మా! అమ్మా... అమ్మా... అ...మ్మా... అ...అ... అ..."

రంగరాజు తల వాలిపోయింది.